

జీతాలు రాలే..

- మూడు నుంచి 9 నెలలుగా అందని వేతనాలు
- ఎదురు చూస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు
- భారంగా మారిన కుటుంబపోషణ.. ఆర్థికంగా అవస్థలు
- జిల్లాలో 461 జీపీల్లో 1,667 మంది సిబ్బంది విధులు
- ప్రభుత్వం వెంటనే సాలరీ ఇవ్వాలని విజ్ఞప్తి



అమనగల్‌లో పారిశుధ్య పనులను నిర్వహిస్తున్న జీపీ సిబ్బంది (ఫైల్)



మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : గ్రామపంచాయతీల్లో విధులను నిర్వహిస్తున్న కార్మికులు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. జీపీల వారీగా మూడు నుంచి తొమ్మిది నెలల వరకు వారికి జీతాలు రావల్సి ఉంది. ఆయా క్యాటగిరిల్లో పనులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింది. నెలనెలా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. సంక్రాంతి పండుగకు కూడా చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో తమ పిల్లలకు కొత్త బట్టలు కొనివ్వలేక పోయామని కార్మికులు వాపోయారు. కార్మిక సిబ్బంది విధుల్లోకి రాకపోతే గ్రామాల్లో ఎక్కడి చెత్తఅక్కడే పేరుకుపోయే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టాలను దృష్టిలో పెట్టుకుని గోడును ఆలకించి, వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో 461 జీపీల్లో 1,667 మంది సిబ్బంది..


మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 461 గ్రామపంచాయతీల్లో సుమారు 1,667 మంది కార్మికులు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి నెలకు రూ.9,500 వేతనం ఇవ్వాలంటూ సర్పంచులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 31 వరకు సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో జీపీల్లో ఉన్న నిధులను గతంలో చేసిన పనులకు బిల్లుల రూపంలో తీసుకుంటున్నారే తప్ప.. గత కొన్ని నెలలుగా వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్న జీపీ కార్మికులకు మాత్రం వేతనాలు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆయా గ్రామపంచాయతీల్లో 3 నుంచి 9 నెలలుగా వేతనాలు ఇవ్వలేదు! ఎప్పుడు సర్పంచులు తమకు వేతనాలు ఇస్తారోనని కళ్లుకాయలు కాచేలా జీపీ కార్మికులు ఎదురుచూస్తున్నారు. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషన్స్ ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ వేతనాలను విడుదల చేయాలని కార్మికులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

సిబ్బంది డిమాండ్లు ఇవే..

- గ్రామపంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలి.
- పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బెసిక్‌ను వేతనంగా చెల్లించాలి. జీవో నెంబర్ 60 ప్రకారం.. స్వీపర్లకు రూ.15,600, బిల్‌కలెక్టర్, కారోబార్‌లకు రూ.1,9500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనంగా అందించాలి.
- గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను కేటాయించాలి.
- 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా అవసర ప్రాతిపదికన పెరుగుతున్న జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలి.
- ప్రతీనెల రెగ్యులర్‌గా వేతనం ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి.
- జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి.
- వివిధ కేటగిరిలన్నింటిని కొనసాగించాలి.
- కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి, వారికి పంచాయతీ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించాలి.
- ప్రతీ వర్కర్‌కు ఇన్సురెన్స్ రూ.5 లక్షల అమలు చేయాలి. ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలి. దహన సంస్కారాలకు రూ.30 వేలు చెల్లించాలి.
- వయస్సు పైబడిందనే సాకుతో కార్మికులను విధుల నుంచి తొలగిస్తే.. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు ఇవ్వాలి.
- ఏడాదికి మూడు జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనె ఇవ్వాలి. వాటిని నగదు రూపంలో ఇచ్చేందుకు అలవెన్సులు చెల్లించాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి, 8 గంటల పనిదినాన్ని అమలు చేయాలి. ఆదివారం, పండుగ సెలవులు, జాతీయ, అంతర్జాతీయ సెలవుదినాలను అమలు చేయాలి.
- కార్మికులపై రాజకీయ నాయకుల వేధింపులు, అక్రమ తొలగింపులు నిలిపివేయాలి. కార్మికులకు సంబంధించిన అంశాలలో ప్రజాప్రతినిధుల, కుటుంబసభ్యుల జోక్యంను అరికట్టాలి. అలా జోక్యం చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

మండలాల వారీగా జీపీ కార్మికులు ఇలా..

మండలం	కార్మికులు
బయ్యారం	98
చిన్నగూడూరు	37
దంతాలపల్లి	78
డోర్నకల్	111
గంగారం	29
గార్ల	91
గూడూరు	159
కేసముద్రం	199
కొత్తగూడ	61
కురవి	161
మహబూబాబాద్	136
మరిపెడ	108
నర్సింహులపేట	62
నెల్లికుదురు	157
పెద్దవంగర	70
తొర్రూరు	110
మొత్తం	1,667



కుటుంబపోషణ భారంగా ఉంది..

- ధర్మారపు సుధాకర్, జీపీ కార్మికుల సంఘం జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్, మహ-బాద్

గత కొన్నినెలలుగా తమకు వేతనాలు అందకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింది. బయట నుంచి తీసుకువచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఏం చేయాలో కూడా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాం. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైన తమ గోడును పట్టించుకుని తమ వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

నిధులు రాగానే వారికి వేతనాలు అందిస్తాం..

- హరిప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి నిధులు రాగానే ఆయా జీపీల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు అందజేస్తాం. ఇటీవల కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధుల నుంచి జీపీ విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు చెల్లించాం. మిగిలిన నిధుల నుంచి జీపీ సిబ్బందికి వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా

- ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



అభినందన సభలో మాట్లాడుతున్న జాటోతు రాంచంద్రునాయక్

కురవి, జనవరి 18 : అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసిన అందరికి అండగా ఉంటానని, నియోజకవర్గ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. కురవిలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ తన గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిందన్నారు. పేదల హక్కుల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న కమ్యూనిస్టులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు రాంచంద్రునాయక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, బండి శ్రీనివాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నెల్లూరి నాగేశ్వర్‌రావు, మండల కార్యదర్శి కర్నం రాజన్న, మారగాని బాలకృష్ణ, గంజి శేషాద్రిరెడ్డి, పోలెపాక వెంకన్న, తురక రమేష్, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, బుర్ర సమ్మయ్య, స్టాలిన్, నర్సింగం గురవయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవిత చరిత్రపుస్తకాల పంపిణీ..

కురవిలోని సిద్ధార్థ విద్యాలయంలో ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ చేతుల మీదుగా అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందించిన తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, నీరుడు సామేల్, తప్పెట్ల వీరన్న, మాఅసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేందర్, ఇనుగుర్తి సుధాకర్, పొన్నాల యుగేందర్, అంబటి వీరభద్రం, బండి శ్రీను, అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.27 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన..

కురవి జడ్పీహెచ్ఎస్‌లో రూ.27 లక్షలతో సమగ్రశిక్ష నిధుల నుంచి మంజూరైన రెండు అదనపు గదులకు ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర ఉన్న కురవి జడ్పీహెచ్ఎస్ పాఠశాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి : కలెక్టర్




జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, వాహనాలు నడుపి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవవగాహన కల్పించాలని సూచించారు. ఫిబ్రవరి 14 వరకు జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలను గ్రామగ్రామాన నిర్వహించి ప్రమాదాలను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ (ఎంవీఐ) ఎం.వెంకన్న పాల్గొన్నారు.

చలో అయోధ్య!

అయోధ్య రామ్‌లల్లాకు ప్రత్యేక రైళ్లు



- వరంగల్ నుంచి ప్రతీ సోమవారం 'శ్రద్ధాసేత్'
- కాజీపేట నుంచి ప్రతీ శుక్రవారం యశ్వంత్‌పూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్
- జనరల్ టికెట్. రూ.400, స్లీపర్ రూ.685
- 30 నుంచి కాజీపేట నుంచి స్పెషల్ ట్రైన్లు

7

నేటి నుంచి నిట్‌లో టెక్నోజియాన్



- 'ఇంజీనీయస్' థీమ్ మూడురోజుల పాటు నిర్వహణ
- ప్రారంభ వేడుకకు ప్రముఖ సైంటిస్ట్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందర రాజన్ రాక
- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

నిట్‌క్యాంపస్ (కాజీపేట), జనవరి 18: వరంగల్ నిట్‌లో యేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే టెక్నో ఫెస్ట్ టెక్నోజియాన్- 2024 జనవరి 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి తెలిపారు. గురువారం నిట్ సెనెట్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి మాట్లాడారు. నిట్ టెక్నోజియాన్ యువతకు, సాంకేతిక అభివృద్ధి అందించడంలో ఎంతగానో తోడ్పడిందన్నారు. ఈ ఫెస్ట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలు సేకరించడానికి, వారి సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ టెక్నోజియాన్‌లో అనేక టాప్‌క్లాస్ ఈవెంట్‌లు ఉంటాయన్నారు. ప్రతీ ఏటా వివిధ థీమ్‌లతో నిర్వహించే టెక్నోజియాన్‌ను ఈ ఏడాది 'ఇంజీనీయస్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. ఇంజనీయస్ అంటే ఇన్నోవేషన్‌ను సూచిస్తుందని, ఇది అన్వేషణ, సృజనాత్మకత, సాంకేతిక పరివర్తన దాని స్ఫూర్తిని కల్పించే భావన అన్నారు.

కాగా, నిట్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించనున్న టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిట్ చెన్నై త్రిచి డైరెక్టర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందర రాజన్ హాజరుకానున్నారని నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి చెప్పారు. ఏరోస్పేస్, మిస్సైల్‌కు సైంటిస్టుగా పని చేసిన ఆయన.. నిట్ టెక్నోజియాన్‌కు ముఖ్య అతిథిగా రావడం అభినందనీయం అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం, ఇస్రో సైంటిస్ట్ టీఎస్ సురేశ్‌కుమార్ పాల్గొననున్నారని చెప్పారు. జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, డర్చువల్ రియాలిటీ, డీబగ్గింగ్ మానియా, మొదలైన స్పాట్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇవే కాకుండా వర్క్‌షాపులు, సాంకేతిక కార్యక్రమాలు, క్విజ్ తోపాటు సుమారు 40 ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ టెక్నోజియాన్‌లో పాఠశాలల విద్యార్థులు తమ నమూనాల, ఆలోచనలు కూడా ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్, టెక్నోజియాన్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ పి.హరిప్రసాద్, ప్రొఫెసర్లు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, టెక్నోజియాన్ కోర్ టీం సభ్యులు చంద్రనాయక్, సాహత్, విష్ణు, స్ఫూర్తి విశాల్ పాల్గొన్నారు.

24న వాహనాలకు వేలం

నెల్లికుదురు సెంటర్, జనవరి 18 : మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 24న వేలం పాట నిర్వహించనున్నట్లు సీఐ జి.చిరంజీవి తెలిపారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్‌అండ్‌ప్రొహిబిషన్ అధికారి కిరణ్‌నాయక్ ఆదేశాల మేరకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మానుకోట ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ద్విచక్రవాహనాలకు రూ.20 వేలు, ఆటోలకు రూ.30 వేలు, ఫోర్‌వీలర్స్ కోసం రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాటలో అతడికి వాహనం రాని పక్షంలో అతని డిపాజిట్ సొమ్మును వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి



బలపాలలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి పుల్లయ్య

కురవి, జనవరి 18 : తెలుగుదేశం పార్టీని స్థాపించి, అధికారంలోకి తీసుకువచ్చి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఎన్టీఆర్ సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి పుల్లయ్య అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం బలపాలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పేరం వీరస్వామి, నామ పద్మాకర్, ఎస్‌కె. నబి, ఆర్.శ్రీను, పరుశలింగం, అరుణ్, క్రాంతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- నెల్లికుదురు సెంటర్ : స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన మహనీయుడని టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ఆయన వెంట బీసీ సెల్ నాయకుడు మార్నేని దామోదర్ పాల్గొన్నారు.
- మానుకోట జిల్లా కేంద్రం శివారు రజాలీపేట పాఠశాలలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుతారపు వెంకటనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ పేదప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన మహనీయుడని కొనియాడారు.
- మరిపెడ : తెలుగు ప్రజలకు ఎంతో ఆదర్శనీయుడు ఎన్టీఆరేనని ఆయన అభిమాన సంఘం మరిపెడ మండల అధ్యక్షుడు తాడూరి రమేశ్ అన్నారు. మరిపెడలోని ఎన్టీఆర్ అభిమాన సంఘ బాధ్యులు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గండి సత్యనారాయణ, నారెడ్డి దామోదర్‌రెడ్డి, మామిడాల వెంకన్న, ఇరుగు రవి, పొన్నం శ్రీకాంత్ పాల్గొన్నారు.
- డోర్నకల్ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని డోర్నకల్‌లో ఆయన విగ్రహానికి అభిమానులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోఎన్టీఆర్ అభిమాని రావూరి మోహన్‌రావు, తాళ్లూరి గంగాధర్, బిక్కసాని రామకృష్ణ, చావ వెంకటేశ్వర్లు, పాటి రమేష్, మాద యాకాంబ్రం, పోటు చంద్రశేఖర్, సుంకర వెంకన్న, పెద్దిని వీరభద్రం, లక్ష్మయ్య, సింధుశేఖర్, బొమ్మన అశోక్‌కుమార్ పాల్గొన్నారు.
- గార్ల : దివంగత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గార్లలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి మూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎలమరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు జితేందర్ కుమార్ అగ్రవాల్, పిడమర్తి రమేష్, దశరథ్, రామారావు, కాంగ్రెస్ నాయకులు మండా రాము గౌడ్, బాధవత్ ప్రసాద్, సీపీఐ నేత పోతుల నర్సింహారావు పాల్గొన్నారు.

లారీ ట్రాన్స్‌ఫోర్టు హమాలీ కార్మికుల రేట్ల పెంపు

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్

మహబూబాబాద్ టౌన్, జనవరి 18 : పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో షాపుల యాజమానులతో చర్చించి, లారీ ట్రాన్స్‌ఫోర్టు హమాలీ కార్మికుల రేట్లను పెంచుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ తెలిపారు. మహబూబాబాద్‌లో గురువారం ఏఐటీయూసీ నేతలు, ఫర్టిలైజర్స్, ఐరన్ షాపుల యాజమానులతో లారీ ట్రాన్స్‌ఫోర్టు హమాలీ కార్మికుల రేట్ల పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రెండేళ్లకు ఒకసారి రేట్లను పెం చుకోవడం జరుగుతుందని, అందులో భాగంగా చర్చలు జరిపి హమాలీ రేట్లను పెంచుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, షాపులయాజమానులు వేమిశెట్టి సోమయ్య, ప్రతాపని పాండురంగయ్య, భాస్కర్‌రావు, ఉపేందర్‌రావు, శ్రీరంగం ఉపేందర్, సత్యనారాయణ, వెంకన్న, చంద్రయ్య, లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు పెరుగుకుమార్, రాము, లింగయ్య, రమేష్, రవి, కర్ణ, శ్రీను, రెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిని మోడల్‌గా అభివృద్ధి చేస్తా..

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

పాలకుర్తి (జనగామ జిల్లా), జనవరి 18 : పాలకుర్తిని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామాల వారీగా అభివృద్ధిపై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ముఖ్యకార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని తెలిపారు. పార్టీ నాయకులు గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను గుర్తించి తనకు తెలపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా పని చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో నాయకుల పాత్ర కీలకంగా ఉండాలని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పేదలకు సంక్షేమ పథకాలు అందేలా పనిచేయాలి తప్ప అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, జల్లం కుమారస్వామి, పసులాది యాకస్వామి, అనుమల మల్లారెడ్డి, చిలువేరు కృష్ణమూర్తి, సర్పంచులు నాగభూషణం, పోగు రాజేశ్వరి శ్రీనివాస్, బక్క పుల్లయ్య, మాచెర్ల పుల్లయ్య, ముస్కు నిర్మల చంద్రబాబు, బిర్రు సోమేశ్వర్, కారుపోతు శ్రీనివాస్, గడ్డం యాకసోమయ్య పాల్గొన్నారు.

గ్రీన్‌ల్యాండ్‌లు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్‌టౌన్, జనవరి 18 : మునిసిపాలిటీలకు కేటాయించిన గ్రీన్‌ల్యాండ్‌లను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు ఈదులపూసపల్లి రోడ్‌లోని రాళ్లవాగు వద్ద గ్రీన్‌ల్యాండ్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ల్యాండ్‌ల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, గ్రీన్‌ల్యాండ్‌లను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వజూనియర్‌కళాశాల సమీపంలోని గ్రీన్‌ల్యాండ్ స్థలాన్ని పరిశీలించారు. పరిశుభ్ర త పనులు చేపట్టి మొక్కలు పెంచి అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. సైడ్‌డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు.ఆయా కార్యక్రమాల్లో కమిషనర్ ప్రసన్నారాణి, టీపీవో నవీన్‌కుమార్, కౌన్సిలర్లు సూర్నపుసోమయ్య, దండెబోయినబుజ్జివెంకన్న, డౌలాగర్ శంకర్, చిదిరాల శరత్, జగన్ పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు

- బావుపేట వద్ద టాటా ఏస్‌ను ఢీకొన్న కారు
- వేములవాడ వెళ్లి వస్తుండగా ఘటన





మృతులు శ్యాంసుందర్, రవి (ఫైల్)

వివరాలు : 6లో..

నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ● వరంగల్ ప్రాంతంలోని సీసీ రోడ్ల పరిశీలన

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), జనవరి 18: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే పనుల బిల్లుల చెల్లింపులు చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బల్దియా పరిధిలో వరంగల్ ప్రాంతంలోని ఫోర్ట్‌రోడ్‌లోని విద్యానగర్ కాలనీ, బృందావన్ పబ్లిక్ స్కూల్, రంగశాయిపేటలోని శ్రీసాయినగర్, నాగేంద్ర నగర్ ఫేజ్-2 ప్రాంతం, కరీమాబాద్ బండి వారి వీధి, ఉర్సు వాటర్‌ట్యాంక్ ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన సీసీ రోడ్లకు చెందిన బిల్లుల చెల్లింపు కోసం కమిషనర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టెండర్ నిబంధనలకు లోబడి అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. నాణ్యత ప్రమాణాల్లో నిబద్ధత లేకుంటే బిల్లుల్లో కోత విధించడం జరుగుతుందన్నారు. రంగశాయిపేట ప్రాంతంలో రోడ్డుపై గృహ నిర్మాణ వ్యర్థాలను ఉంచిన యజమానికి పెనాల్టీ విధించాలన్నారు. అలాగే నాగేంద్ర నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనానికి అనుమతి ఉందో లేదా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, డీఈ రవికిరణ్, శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, ఏఈలు మోజామిల్, హబీబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

టీయూఎఫ్ఐడీసీ పథకం కింద అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ ముంపు నివారణ చర్యల్లో భాగంగా గతంలో సూచించిన అభివృద్ధి పనులే కాకుండా ఇందులో చేర్చాల్సిన పనులైన ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పైన తగు సూచనలు చేశారు. భద్రకాళి నాలా, బండ్ నుంచి వెళ్లే నాలా, చిన్న వడ్డెపల్లి చెరువు నుంచి, పెద్ద వడ్డెపల్లి నుంచి వెళ్లే నాలాలతోపాటు రిటైనింగ్ వాల్స్, బల్దియా పరిధిలోని 66వ డివిజన్లలో అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టులు, అంతర్గత రహదారుల నిర్మాణాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు ● బావుపేట వద్ద టాటా ఏస్‌ను ఢీకొన్న కారు

హసన్‌పర్తి/కరీమాబాద్, జనవరి 18: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా గురువారం రాత్రి టాటా ఏస్ వాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో వరంగల్‌లోని ఉర్సు - కరీమాబాద్‌కు చెందిన ఆమంచ శ్యాంసుందర్ (45), ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన డ్రైవర్ రవి (40) ఇద్దరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. హసన్‌పర్తి సబ్ ఇన్స్‌పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..

ఉర్సు ప్రాంతానికి చెందిన ఉర్సు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు, మునిసిపల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఆమంచ శ్యామ్(53).. ఈనెల 16న కుటుంబసభ్యులతో కలిసి శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వేములవాడకు బయలుదేరాడు. శ్యామ్ తల్లి లలిత, భార్య దేవి, కుమారుడు లక్ష్మణ్, సోదరుడు ఆమంచ సంతోష్, అతడి కూతురు అలేఖ్య, కుమారుడు నాగేంద్రతో కలిసి తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన కదరిక రవి(40) టాటా ఏఎస్ వాహనంలో వెళ్లారు. దర్శనం చేసుకుని గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం బావుపేట గ్రామం వద్దకు రాగానే ఆటో ట్రాలీని వెనుకనుంచి వచ్చిన ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమంచ శ్యామ్ అక్కడికక్కడే మృతి చెందగా, కుటుంబ సభ్యులతోపాటు, ఆటో డ్రైవర్ రవికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ రవి (40) మృతి చెందాడు. ఆటో డ్రైవర్ రవికి భార్య శ్రీవిద్య, కుమారులు కిరణ్ తేజ, రవితేజ, కూమార్తె శ్రీ కీర్తన ఉన్నారు. మరో మృతుడు ఆమంచ శ్యామ్ కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు



మృతి చెందిన ఆమంచ శ్యామ్

బస్సు ఎక్కితే ప్రాణాలు దక్కేవి..

ఆమంచ శ్యామ్ వేములవాడ నుంచి కరీంనగర్ చేరుకున్నాక తాను బస్సులో వస్తానని చెప్పి కరీంనగర్ బస్టాండ్‌కు వెళ్లాడు. కానీ, అక్కడ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో తిరిగి ఆటోలోనే ఎక్కాడు. బస్సులో ఎక్కినా బతికేవాడని మృతుడి తల్లి ఆమంచ లలిత, అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, మృతుడు శ్యామ్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని స్థానికులు చెబుతున్నారు.

సంఘటితంతోనే సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టి

ఐనవోలు మార్ట్‌ను సందర్శించిన నాబార్డు సీజీఎం సుశీల చింతల

ఐనవోలు, జనవరి 18: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్) ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయని నాబార్డు సీజీఎం సుశీల చింతల తెలిపారు. నందనం ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఐనవోలులో ఏర్పాటు చేసిన సూపర్‌మార్కెట్(మార్ట్) విక్రయకేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. మార్ట్‌లో వస్తువుల క్రయ, విక్రయాలు జరుగుతున్న తీరు, వినియోగదారులకు లభించే ధరలను పరిశీలించారు.



ఐనవోలులో మార్ట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు సీజీఎం సుశీల చింతల, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐనవోలులో ఏర్పాటు చేసిన మార్ట్ వినియోగదారులకు ఆకట్టుకునేవిధంగా ఉందన్నారు. పట్టణాల్లో కార్పొరేట్ స్థాయిల్లో ఏర్పాటు చేసే మార్ట్‌లకు తీసిపోనివిధంగా ఐనవోలు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్యాక్స్ మార్ట్‌లో వస్తువులు, నిత్యావసర సరుకులు మార్కెట్ ధరలకంటే వినియోగదారులకు తక్కువకే విక్రయిస్తూ తాము సైతం ఆర్థికంగా ఎదిగేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేవలం 10 మాసాల కాలంలో రూ.1.89 కోట్ల వ్యాపారం నిర్వహించి రూ.13 లక్షల లాభాలను ఆర్జించినట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాపార కేంద్రంలో కీలక భూమిక పోషిస్తున్న నందనం ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సభ్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మొబైల్ విక్రయసేవలతోపాటు మార్ట్‌ల్లో కూరగాయల విక్రయం, వివిధరంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మహిళలు, రైతులకు శిక్షణ ఇచ్చి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాబార్డు డీజీఎం శ్రీనివాసులు, డీడీఎం రవి, చంద్రశేఖర్, డీసీసీబీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వజీర్‌సుల్తాన్, ఏజీఎం ఎల్. రాజశేఖర్, డీసీవో నాగేశ్వర్‌రావు, ఇంజనీర్ మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, డైరెక్టర్లు చిరంజీవి, శ్రీనివాస్, రాజారపు కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల్లో మార్పులు

వరంగల్, ములుగు జిల్లాలకు రవికుమార్, బలరామ్

హనుమకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ సంస్థాగత మార్పులను చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షులను మార్చింది. పలు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బాగాపని చేసిన జిల్లాల అధ్యక్షులను మాత్రం మార్చలేదు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షులకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫోన్ చేసి సమాచారం అందించారు.

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా రావు పద్మను యథావిధిగా కొనసాగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పద్మ 20వేలకుపైగా ఓట్లు తెచ్చుకొని మూడోస్థానంలో నిలిచారు. అలాగే జనగామ జిల్లా అధ్యక్షుడిని కూడా మార్చలేదు. ప్రస్తుతం జనగామ జిల్లాకు డాక్టర్ ఎ.దశమంథరెడ్డిని కొనసాగించింది. అయితే మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షుల పేర్లను జాబితాలో పేర్కొనలేదు. పాతవారినే కొనసాగిస్తారా లేక ఈ జిల్లాల అధ్యక్షుల మార్పును పెండింగ్‌లో పెట్టిందా అన్న విషయమై స్పష్టత లేదు. మిగతా జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు.

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్‌ను, ములుగు జిల్లా అధ్యక్షుడిగా బలరామ్‌ను పార్టీ నియమించింది. మొత్తం 12 జిల్లాలకు కొత్త అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆరు మోర్చాలకు కూడా కొత్త అధ్యక్షులను నియమించింది. ఇందులో భాగంగా ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా కొండేటి శ్రీధర్ నియమితులయ్యారు. శ్రీధర్ ఇంతకు ముందు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 18: ఎన్పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2, టీవీ టవర్ కాలనీ, వాటర్ ట్యాంక్, వెంకటేశ్వర్ ఆలయం, నాగరాజు ఆలయం ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గాకాలనీ ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, దర్గా, బాలసంతావాడ, హరిజనవాడ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఫాతిమానగర్ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, భవానీనగర్, హౌసింగ్‌బోర్డు, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వడ్డెపల్లి, విజయ్‌పాల్‌కాలనీ, టీచర్స్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గొర్రెకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా కరీమాబాద్ రోడ్, శాంతినగర్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, ఫోర్ట్ రోడ్, వాల్‌మార్ట్, అన్నపూర్ణ కాంప్లెక్స్, పద్మశాలి వీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మామునూర్, నక్కలపల్లి, బెస్తం చెరువు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, అరెపల్లి, అయ్యప్ప ఆలయం, అగ్రికల్చర్ కాలేజీ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, పోచమ్మమైదాన్ సర్కిల్, మండిబజార్, బొందలకుంట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేషి మల్లికార్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేయూలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 18: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం, సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ (సీఇఎల్‌టీ) ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై 40 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేసినట్లు సీఇఎల్‌టీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 22 నుంచి ప్రతీ రోజు సాయంత్రం తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆంగ్లభాష సామర్థ్యాల పెంపు, దినచర్యలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ పాత్ర, ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్, డిబెట్, వివిధ మాధ్యమాలను ఉపయోగించి సమాచార సేకరణ పంపటం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వర్సిటీ విద్యార్థులకు రూ.వెయ్యి, ఇతర విద్యార్థులకు రూ.1500 చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు కేయూ ఇంగ్లీష్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.





చలో అయోధ్య!

అయోధ్య రామ్‌లల్లాకు వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి ప్రత్యేక రైళ్లు

గిర్మాజీపేట, జనవరి 18 : అయోధ్యలో రామ మందిర నిర్మాణ పూర్తయిన సందర్భంగా అయోధ్య రామ్‌లల్లా మందిరానికి రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. అయోధ్యకు దేశ నలుమూల నుంచి రైలు సదుపాయం కల్పించాలని రైల్వేశాఖ భావిస్తోంది. ఇప్పటి వరకు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలకు నేరుగా అయోధ్య వెళ్లేందుకు రైలు సదుపాయం లేదు. అయితే రామ మందిరం ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ల అందుబాటులోకి తెచ్చారు. అలాగే, వంద రోజులపాటు ప్రత్యేక రైళ్లను కాజీపేట నుంచి నడువనున్నాయి. అయోధ్యలో రద్దీ నేపథ్యంలో వీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. వంద రోజుల తర్వాత వీటిని ఇలాగే కొనసాగిస్తారా.. లేక రద్దు చేస్తారా.. అన్నది తెలియాల్సి ఉంది.

వరంగల్ నుంచి శ్రద్ధాసేత్ ఎక్స్‌ప్రెస్

వరంగల్ నుంచి నేరుగా అయోధ్యకు ఇటీవల రామేశ్వరం- అయోధ్య ధామ్ శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తెచ్చారు. శ్రద్ధాసేత్ ప్రతీ ఆదివారం రాత్రి 11.50 గంటలకు రామేశ్వరం నుంచి బయలుదేరి సోమవారం రాత్రి 11.08 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. వరంగల్‌లో రాత్రి 11.10 గంటలకు బయలుదేరి బల్లార్ష, నాగపూర్, ఈటార్సీ, జబల్‌పూర్, సత్నా, ప్రయాగరాజ్ మీదుగా బుధవారం ఉదయం 4.40 గంటలకు అయోధ్య ధామ్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. అలాగే, అయోధ్య నుంచి రామేశ్వరం ప్రయాణించే శ్రద్ధాసేత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం రాత్రి 11.10 గంటలకు అయోధ్యలో బయలు దేరి శుక్రవారం తెల్లవారు జామున 2.03 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. తిరిగి 2.05 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరి విజయవాడ, గూడూరు మీదుగా రామేశ్వరానికి శనివారం తెల్లవారుజామున 3.10 గంటలకు చేరుకుంటుంది.

కాజీపేట నుంచి యశ్వంతపూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్..

ప్రతీ శుక్రవారం కాజీపేట నుంచి అయోధ్యకు యశ్వంతపూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇటీవల అందుబాటులోకి వచ్చింది. గురువారం రాత్రి 11.40 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.08గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 2 నిమిషాల అనంతరం కాజీపేట నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 4.24గంటలకు అయోధ్యధామ్ చేరుకుంటుంది.

టికెట్ ధరలు ఇలా..

రామేశ్వరం-అయోధ్య, ధామ్-రామేశ్వరం మధ్య నడిచే శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ని వర్గాల ప్రజలు ప్రయాణించేలా రిజర్వేషన్‌తో పాటుగా జనరల్ బోగీలు ఉన్నాయి. సెకండ్ ఏసీ బోగీలు 2, థర్డ్ ఏసీ బోగీలు 3, స్లీపర్ బోగీలు 7, జనరల్ బోగీలు 2 ఉన్నాయి. జనరల్ బోగీలు ముందు ఒకటి. వెనుక ఒకటి ఉన్నాయి. వరంగల్ నుంచి అయోధ్యకు జనరల్ టికెట్ రూ.400, స్లీపర్ రూ.685, సెకండ్ ఏసీ రూ.2,570, థర్డ్ ఏసీ రూ.1,790 ఉంది. అయోధ్య నుంచి వరంగల్‌కు కూడా ఇవే ధరలు ఉన్నాయి. అలాగే కాజీపేట నుంచి అయోధ్యకు, అయోధ్య నుంచి కాజీపేటకు యశ్వంతపూర్- గోరక్‌పూర్-యశ్వంత్‌పూర్ రైల్‌లోనే ఇవే టికెట్ ధరలు ఉన్నాయని తెలిసింది. .

30 నుంచి కాజీపేట నుంచి ప్రత్యేక రైళ్లు

ఈనెల 22న అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన నేపథ్యంలో అయోధ్యలో పెరగనున్న రద్దీ దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ సికిందరాబాద్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి అయోధ్య ధామ్ స్టేషన్‌కు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా కాజీపేట- అయోధ్య ప్రత్యేక రైళ్లు కాజీపేట నుంచి ఈనెల 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26,2 8 తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు అయోధ్యకు బయలుదేరుతాయి. సికిందరాబాద్ నుంచి అయోధ్య మధ్య నడిచే ప్రత్యేక రైళ్లు ఈనెల 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో సాయంత్రం 4.45గంటలకు సికిందరాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరుతాయి. ఈ రైళ్లన్నీ కాజీపేట మీదుగానే అయోధ్యకు వెళుతూ కాజీపేటలో ఆగుతాయి. సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్‌ల నుంచి అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైళ్ల టికెట్‌ను కేవలం రైల్వేకి చెందిన ఐఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని రైల్వేశాఖ తెలిపింది. అయితే టికెట్ ధరలను ప్రకటించలేదు.

మిర్చి, పసుపు నాణ్యత ఉండేలా చూడాలి

స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట

వరంగల్‌టౌన్, జనవరి 18: మిర్చి పసుపు పంట సరుకు నాణ్యత ఉండేలా చూసుకోవాలని, అప్పుడే ఎగుమతులకు, గిట్టుబాటు ధర పలికే అవకాశ ఉంటుందని వరంగల్ రీజియన్ స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట అన్నారు. గురువారం నగరంలోని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్పైసెస్ బోర్డు వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో రైతులకు, వ్యాపారులకు అవగాహన సదస్సు చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజిష్ట మాట్లాడుతూ.. సుగంధ ద్రవ్యాలు, పసుపు, మిర్చి నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలోనే మిరప పంట ఉత్పత్తిలో తెలంగాణ లోని ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎక్కువగా సాగు అవుతుందన్నారు. పసుపు సాగుకు కూడా అనువైన భూములు ఇక్కడ ఉన్నాయన్నారు. స్పైసెస్ బోర్డు ల్యాబ్ వరంగల్‌లో లేకపోవడం వల్ల ప్రతీసారి హైదరాబాద్‌కు, లేదా గుంటూరుకు వెళ్లాలంటే రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ స్పైసెస్ ల్యాబ్ ఏర్పాటుకు కావాల్సిన భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా... ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాబార్డు అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, చాంబర్ ప్రతినిధులు మడ్డిరి వేదప్రకాష్, కైలాస హరినాథ్, రాజేశ్వర్‌రావు, గౌరిశెట్టి శ్రీనివాస్, రాయిశెట్టి సత్యనారాయణ, దేవర రమేష్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజిష్ట



కరపత్రాలు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు సుధ

గురుకుల ప్రవేశ పరీక్షలపై ప్రచారం

హనుమకొండ రూరల్, జనవరి 18: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను 5వ తరగతి ప్రవేశ పరీక్షపై ఓ ఉపాధ్యాయురాలు విస్తృత ప్రచారం చేస్తోంది. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మాడిశెట్టి సుధ గురుకుల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యారాణి ఆదేశాలతో హనుమకొండ పద్మాక్షి కాలనీలో గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 11వ తేదీన పరీక్ష ఉంటుందని ప్రచారంలో భాగంగా వివరిస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో కల్పించే వసతులు, విద్యా ప్రమాణాలు, క్రీడలు తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

కమిషనరేట్‌లో ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

హనుమకొండ క్రైం, జనవరి 18: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే పీఎస్‌లో ఎక్కువ రోజు లు విధులు నిర్వర్తిస్తుండడంతో ఇద్దరికి స్థానచలనం కలిగించారు. హనుమకొండ పీఎస్‌లో పని చేస్తున్న బి.రామారావును చెన్నారావుపేటకు, చెన్నారావుపేటలో పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను హనుమకొండకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు.

రైల్వే క్రికెట్ పోటీల్లో లోకోపైలెట్ టీం విజయం

కాజీపేట, జనవరి 18: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే స్టేడియంలో నిర్వహిస్తున్న రైల్వే క్రికెట్ పోటీలు గురువారం మూడో రోజు కొనసాగాయి. ఈ పోటీలను డీఈఈ అభిషేక్ మిశ్రా, చీఫ్ క్రూకంట్రోలర్ ఎ.సాంబశివుడు హాజరై పోటీలను ప్రారంభించారు. చీఫ్ క్రూ కంట్రోల్ ('సీసీసీ)లోకోపైలెట్ టీం, మహబూబాబాద్ టీంలు మధ్య జరిగిన పోటీల్లో (సీసీసీ) లోకోపైలెట్‌ల టీం విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం, వరంగల్ కింగ్స్ 11 టీం మధ్య జరిగిన పోటీలో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి. రాజేశ్వర్‌రావుతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

వాజేడు, జనవరి 18: లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ములుగు కోర్టు తీర్పు వెలువరించింది. వాజేడు ఎస్సై సి.హెచ్.వెంకటేశ్వరరావు ఈ మేరకు గురువారం వెల్లడించారు. వాజేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో ఓ మహిళపై చెరుకూరుకు చెందిన యాలం భూపతిరావు లైంగికదాడి చేశాడు. బాధితురాలు వాజేడు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ కె.శివప్రసాద్, ఎస్సై కె. తిరుపతిరావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు.

ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ సి.హెచ్.సత్యనారయణ కేసును వాదించారు. వాదోపవాదాల అనంతరం ములుగు జిల్లా జడ్జి లలితశివజ్యోతి ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 18వేల జరిమానా విధించారు.

నర్సంపేటలో దొంగల హల్‌చల్

తాళం వేసి ఉన్న రెండిళ్లల్లో చోరీ



చోరీకి గురైన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

నర్సంపేట టౌన్, జనవరి 18: రెండిళ్లలో దొంగలు పడి బుధవారం రాత్రి నగలు, నగదు దోచికెళ్లారు. ఈ ఘటనలో రూ.7లక్షల నగదు అపహరణకు గురైంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. హనుమకొండ ప్రాంతానికి చెందిన మొలుగూరి నాగేందర్ కుటుంబం ఆరు నెలలుగా నర్సంపేట పట్టణంలోని మహబూబాద్‌లోని ఓంసాయినగర్‌లోని ఓ ప్లాట్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. నాగేందర్ కొద్ది రోజులుగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో జాయింట్ వీల్ (ఎగ్జిబిషన్) వ్యాపారం నిర్వర్తిస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చిపోతున్నాడు. భర్తకు తోడుగా ఉండేందుకు నాగేందర్ భార్య శిరీష, కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 16న ఇంటికి తాళం వేసి జాతరకు వెళ్లింది. కాగా, నాగేందర్, శిరీషలు గురువారం తెల్లవారు జామున 3 గంటలకు ఇంటికి రాగా, ఇంటి మెయిన్ డోర్‌కు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడం, అందులోని రూ.7 లక్షల నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా టౌన్ సీఐ సుంకరి రవీందర్, ఎస్సై శీలం రవి, క్లూస్ టీమ్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఇదిలావుండగా, నాగేందర్ ఇంటి పక్కన ఉన్న ఇమ్మడి వెంకటేశ్వర్లు, పద్మల కుటుంబం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కొడుకు వద్దకు వెళ్లారు. వీరి ఇంటి తాళాలు సైతం దొంగలు పగులగొట్టి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర చేశారు. విషయాన్ని పోలీసులు వెంకటేశ్వర్లు కుటుంబానికి సమాచారం అందించినప్పటికీ వారి నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ వివరించారు.

వెల్‌నెస్ సెంటర్‌కు ఏర్పాట్ల పరిశీలన

కాళోజీ జంక్షన్, జనవరి 18: కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య చికిత్సలు అందించేందుకు హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన వనరుల ఏర్పాటు కోసం సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సర్వీస్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మయ్య గురువారం హనుమకొండకు వచ్చారు. ఈ మేరకు ఆయన వసతి కోసం హనుమకొండ పోస్టాఫీస్ వెనుక గల క్వార్టర్లను, సీఆర్‌పీఎఫ్ క్యాంపులో గల క్వార్టర్లు పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కనీసం 6వేల మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉండాల్సి ఉంటుందని వరంగల్, హనుమకొండ పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వారి సంఖ్య సుమారు 10వేలకు పైగానే ఉన్నట్లు వివరాలను సేకరించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు 25 ప్రాంతాల నుంచి వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్‌లో మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ పనిచేస్తోంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత గల ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అన్ని విధాలుగా అర్హతలు ఉన్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ అభిప్రాయపడినట్లు తెలిసింది. హనుమకొండలో ఏర్పాటు చేసే ప్రతిపాదనను మరో వారం రోజుల్లో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమక్షంలో ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో హనుమకొండ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది.

గృహహింస కేసులో మూడేళ్లు జైలు శిక్ష

నర్సింహులపేట, జనవరి 18 : గృహహింస కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్సై జి.సతీష్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన కొండ రమేష్‌తో పెద్దనాగారం గ్రామానికి చెందిన తేజస్వినికి 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మగ సంతానం రమేష్ వేరొక మహిళను 2013లో వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి తేజస్వినిని తరుచుగా వేధిస్తూ, మానసికంగా హింసిస్తూ, వరకట్నం తేవాలని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో తట్టుకోలేక 2014లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తేజస్విని ఫిర్యాదు చేసింది. కేసు విచారణ చేపట్టిన తొర్రూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సరిత పోలీసులు ప్రవేశపెట్టిన ఆధారాలు, సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయి రమేష్‌కు మూడేళ్ల కారాగార శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ముందస్తు మొక్కులు

మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు



మేడారం, జనవరి 18: వనదేవతలకు భక్తులు గురువారం ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. సుమారు 50 వేల మంది హాజరయ్యారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి మహాజాతర జరగనుండగా ముందస్తుగా మొ క్కులు చెల్లించుకొనేందుకు వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవింద రాజు గద్దెల వద్ద పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారె, కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించారు.



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



వ్యాపారులకు నోటీసులు అందిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ప్లాస్టిక్ వినియోగంపై వ్యాపారులకు నోటీసులు

మేడారం, జనవరి 18 : మేడారంలో ప్లాస్టిక్ వినియోగంపై గ్రామ పంచాయతీ అధికారులు కొరడా ఝళిపించారు. పలువురు వ్యాపారులకు గురువారం నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరగా జరుపుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. దీన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గద్దెల పరిసరాల్లో ఉన్న దుకాణాదారులను వెంటనే తొలగించుకోవాలని ఆదేశించారు.

గ్రామ కార్యదర్శులకు విధుల కేటాయింపు

తాడ్వాయి మండలం మేడారంలో మహా జాతరలో విధులు నిర్వహిచేందుకు గ్రామ పంచాయతీల కార్యదర్శులకు విధులు కేటాయించారు. డీపీవో వెంకయ్య ఆదేశాల మేరకు డీఎల్‌పీవో స్వరూప గురువారం ఈ కేటాయింపులు చేశారు. ములుగు జిల్లాలోని 150 మంది కార్యదర్శులకు ఎంపీవోలు శ్రీధర్‌రావు, శ్రీకాంత్‌నాయుడు, కుమార్, హనుమంతరావు, రహీం, శ్రీనివాస్, సాజిదా , మమత విధులు కేటాయించారు. మేడారం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు సూపర్‌వైజర్లను నియమించారు. మహాజాతర ముగిసే వరకు వీరందరూ విధులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాఫిక్‌జామ్‌కు తావివ్వం

వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ డాక్టర్ శబరీశ్

ములుగు కలెక్టరేట్, జనవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర నేపథ్యంలో వరంగల్-మేడారం వెళ్లేమార్గంలో ట్రాఫిక్‌జామ్ కాకుండా వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. గురువారం ఆయన పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి ములుగు సమీపంలోని గట్టమ్మతల్లి దేవాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులు ముందుగా గట్టమ్మతల్లిని దర్శించుకుని వెళతారని, ఈక్రమంలో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను క్రమపద్ధతిలో మళ్లించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలు చేపడుతున్నామని అన్నారు. వాహనాల రద్దీని తగ్గించేందుకు అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని, అనుకోని విధంగా వాహనాలు మరమ్మతులకు గురైతే వాటిని వెనువెంటనే క్రేన్ల ద్వారా క్లియర్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూస్తామని అన్నారు. రాత్రివేళల్లో డైవర్షన్ పాయింట్లలో రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, గట్టమ్మతల్లి దేవాలయం చుట్టుపక్కల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఉండే దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, ఎస్సై వెంకటేశ్వర్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



గట్టమ్మతల్లి దేవాలయం ఆవరణలో అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ శబరీశ్

కాళేశ్వరంపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జనవరి 18: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులు చేపట్టిన విచారణ రెండోరోజు గురువారంకూడా కొనసాగింది. ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలోని బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. సమారు ఎనిమిది గంటలపాటు ఇరు బ్యారేజీలు, పంప్‌హౌస్‌లో పర్యటించిన అధికారులు జరిగిన నష్టం, దానికి కారణాలపై ఆరా తీశారు. పలు అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

- ఎనిమిది గంటలపాటు పరిశీలన

మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు గురువారం ఉదయం 9.30 గంటలకు విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్‌తోపాటు ఎస్పీ బాలకోటి, పది మంది అధికారులు చేరుకున్నారు. సుమారు రెండున్నర గంటలపాటు పంప్‌హౌస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మోటార్లు, వాటికి అనుసంధానంగా కంప్యూటర్లను పరిశీలించారు. వాటితోపాటు దెబ్బతిన్న ప్రాంతంలో జరిగిన నష్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫోర్‌బే, అప్రోచ్ కెనాల్, డెలివరీ చానళ్లను పరిశీలించిన అధికారులు వరదలకు ముందు, తర్వాత పంప్‌హౌస్ పరిస్థితిపై ఆరాతీశారు. నష్టం జరగడానికి కారణాలను ఇంజనీర్లను అడిగితెలుసుకున్నారు. అనంతరం గ్రావిటీ కెనాల్ మార్గంలో అన్నారం బ్యారేజీకి చేరుకున్న బృందం సుమారు రెండున్నర గంటలపాటు పరిశీలన చేశారు. బ్యారేజీలో బుంగలుపడి నీటి లీకేజీ కాగా ఆప్రాంతంలో అధికారులు చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. దీంతో పాటు గేట్ల వద్ద నీటి లీకేజీ కావడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బ్యారేజీల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి కాళేశ్వరంలోని హరిత హోటల్‌కు చేరుకుని మధ్యాహ్న భోజనం చేశారు.

హరిత హోటల్ నుంచి మేడిగడ్డ బ్యారేజీకి బయల్దేరిన బృందం అక్కడ సుమారు మూడు గంటలపాటు పర్యటించారు. ముందుగా బ్యారేజీ వంతెన పైనుంచి బ్లాక్-7లో కుంగిపోయిన 20వ పిల్లరును పరిశీలించారు. అనంతరం మహారాష్ట్ర వైపు నుంచి నేరుగా వంతెన దిగువకు వెళ్లారు. బ్లాక్-7లో దెబ్బతిన్న 20పిల్లరుతోపాటు దెబ్బతిన్న మిగతాపిల్లర్ల కుంగుబాటుకు గల కారణాలు, జరిగిన నష్టం గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యారేజీ గేట్లను దిగువ నుంచే పరిశీలించిన అధికారులు తిరిగి పైకి చేరుకుని ఆ ప్రాంతాన్ని మళ్లీ పునఃపరిశీలించారు. గేట్ల లిఫ్టింగ్ ప్రక్రియతో పాటు అవి ఎంతమేర ప్రవాహాన్ని తట్టుకోగలవు.. వాటి సామార్థ్యాలు ఏమిటి? అనే విషయాలపై ఆరా తీశారు. బ్యారేజీలో కుంగిపోయిన పిల్లర్లతో పాటు వంతెన దృశ్యాలను విజిలెన్స్ అధికారులు తమ ఫోన్లలో చిత్రీకరించారు. అక్కడి నుంచి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ కంట్రోల్‌రూం కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్షించారు. అనంతరం కాళేశ్వరంలోని హరితహోటల్‌కు తిరిగి వెళ్లిపోయారు.

విజిలెన్స్ అధికారుల పర్యటనకు కొన్ని గంటల ముందు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు మేడిగడ్డ బ్యారేజీ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించారు. విజిలెన్స్ అధికారులు ఎక్కడెక్కడ పరిశీలించనున్నారో ఆ ప్రాంతాల్లో ఆయన తిరిగారు. ఆయన వెళ్లిపోయిన వెంటనే విజిలెన్స్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇది యాదృచ్ఛికమా.. ముందుస్తుగా జాగ్రత్త పాటించేందుకే ఈఎన్సీ పర్యటించారా? అనేది చర్చనీయాంశమైంది.



కన్నెపల్లి పంప్‌హౌజ్ ఫోర్‌బే వద్ద విజిలెన్స్ అధికారులు

బాలవికాస పథకాలు ఆలోచనలు రేకెత్తిస్తాయి..

- ప్రజల కోసం పనిచేసే బాలవికాసకు ప్రభుత్వ సహకారం ఉంటుంది
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కాజీపేట (హనుమకొండ జిల్లా), జనవరి 18 : బాలవికాస పథకాలు ప్రభుత్వాలకే ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉంటూ పూర్తిస్థాయి ప్రజాసేవలో ఉంటాయని, ప్రజల కోసం పనిచేసే బాలవికాసకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో ఏ నూతన కార్యక్రమం మొదలు పెట్టినా అది బాలవికాస నుంచే మొదలవుతుందని అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ట్రెయినింగ్ సెంటర్‌లో గురువారం తాగునీటి శుద్ధీకరణ పథక కమిటీల మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. కొన్నేళ్లుగా బాలవికాస పలు రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళా పథకాలు, చెరువు పూడికతీత, అనాథలకు ఆశ్రమం, తాగు నీటిశుద్ధీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, వితంతు విముక్తి, మూఢనమ్మకాలను నిర్మూలించడం లాంటి కార్యక్రమాలు రూపొందిస్తూ పలు సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా అభినందనీయులన్నారు.

అనంతరం మంత్రి సీతక్కను బాలవికాస కమిటీ శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. అంతకు ముందు బాలవికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా మాట్లాడారు. బాలవికాస 47 యేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పలురాష్ట్రాలో నీటిశుద్ధీకరణ పథకాలతో లక్షల మందికి మంచి నీరు అందిస్తున్నామని అన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటీవ్‌డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. వాటర్ ప్లాంట్‌ల నిర్వహణలో గ్రామపంచాయతీ కమిటీలదే ముఖ్యపాత్ర అన్నారు. ప్లాంట్ల నిర్వహణలో కమిటీలు సేవాభావంతో పనిచేస్తే ఏ సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బాలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేడం లింగమూర్తితో పాటు వాటర్‌ప్లాంట్ల కమిటీల అధ్యక్షులు, ఆపరేటర్లు, సోఫార్ కెనడా ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శోభ, బాలవికాస అధ్యక్షులు నోముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు బాసాని మర్రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దయాకర్‌కు ఎమ్మెల్సీ టికెట్ నిరాకరించడం సిగ్గు చేటు

మహబూబాబాద్ టౌన్, జనవరి 18 : కాంగ్రెస్ పార్టీ నాయకుడు, తెలంగాణ మాలమహానాడు (టీఎంఎం) వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ టిక్కెట్ ఇచ్చినట్లే ఇచ్చి నిరాకరించడం సిగ్గుచేటని టీఎంఎం రాష్ట్ర పొలిటికల్ బ్యూరో సభ్యుడు అశోద భాస్కర్ అన్నారు. దయాకర్‌కు ఎమ్మెల్సీ బీఫాం ఇవ్వకపోవడాన్ని వ్యతిరేకిస్తూ మహబూబాబాద్‌లోని అంబేద్కర్‌విగ్రహం ఎదుట టీఎంఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేష్, కందూకూరి వెంకటాద్రి, నాయిని భరత్, గుండాల భిక్షం, దాసరి యాకన్న, వీరస్వామి, నవీన్, ప్రశాంత్, ముత్తయ్య, శరత్, సాయి రంజిత్ పాల్గొన్నారు.

● తొర్రూరు : అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వకపోవడం దురదృష్టకరమని, దీనిపై కాంగ్రెస్ పార్టీ పునరాలోచించాలని జాతీయ మాల మహానాడు తొర్రూరు పట్టణ అధ్యక్షుడు గొడిశాల నవీన్ అన్నారు. పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, ధర్మయ్య, సైదమ్మ పాల్గొన్నారు.

'శిఖం'ను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : ఇస్లావత్‌తండా (ఎం) పరిధిలోని చెరువు శిఖం భూమిని భార్యపేరిట ఆక్రమించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఇస్లావత్ నరేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ ఇస్లావత్ తండా సమీపంలోని సర్వే నెంబర్ 282 చెరువుశిఖం భూమిలో ఎలాంటి అనుమతి లేకుండ పౌల్ట్రీఫాంను అక్రమంగా నిర్మించారని చెప్పారు.

'జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

తొర్రూరు, జనవరి 18 : రాష్ట్ర వ్యాప్తంగా జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధం జిల్లా అధ్యక్షుడు పాడియా బీకు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రథమ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 28న నాగర్ కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసినమహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు రాము, సంతోష్, వీరన్న, వెంకటయ్య, శేఖర్, లక్ష్మీ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సీడీపీవోగా రాజ్యలక్ష్మి

మహబూబాబాద్ రూరల్, జనవరి 18 : మహబూబాబాద్ మండలం ఇన్‌చార్జి సీడీపీవోగా రాజ్యలక్ష్మిని నియమిస్తూ హైదరాబాద్ కమిషనరేట్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మరిపెడ మండల ఏసీడీపీగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు మహబూబాబాద్ మండల సీడీపీవోగా బాధ్యతలను అప్పగించారు. ఇక్కడ పనిచేసిన లిల్లిడేబోరాపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆమెను హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రైల్వేట్రాక్‌పై యువకుడి ఆత్మహత్యాయత్నం

నెహ్రూసెంటర్, జనవరి 18 : మానుకోట రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు, ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వేంనూరుకు చెందిన బాసబోయిన యాకన్న అనే యువకుడు గత కొంతకాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా వ్యవహరిస్తున్నాడు. దీంతో హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్సను సైతం అందించినట్లు తెలిపారు. మహబూబాబాద్‌కు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి, రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతన్ని నివారించే ప్రయత్నం చేశారు. కానీ, అప్పటికే గూడ్స్ రైలు కాళ్లపై నుంచి పోవడంతో ఒకకాలు విరిగిపోయింది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని గమనించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

29 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నెక్కొండ (వరంగల్ జిల్లా), జనవరి 18 : అక్రమంగా తరలిస్తున్న 29 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ జాన్‌పాష గురువారం తెలిపారు. స్థానిక చల్లాగోదాముల సముదాయం వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, టాటా ఏసీ వాహనంలో అక్రమంగా 29 క్వింటాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. బియ్యంతో పాటు వాహనం స్వాధీన పర్చుకోవడంతో పాటు సిద్దిపేట జిల్లా నంగూనూరు గ్రామానికి చెందిన డ్రైవర్ మోతె సాయి తరుణ్‌పై కేసు నమోదు చేశామన్నారు. కేసముద్రం మండలం తాళ్లపూసలపల్లిలోని నల్లా శ్రీధర్ ఇంటి నుంచి ఈ బియ్యాన్ని సిద్దిపేటకు తరలిస్తున్నట్లు విచారణలో తెలిందని చెప్పారు. ఈ కేసులో మరో నిందితుడు సిద్దిపేటకు చెందిన బాలయ్య అనేవ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి వ్యక్తి మృతి

గూడూరు, జనవరి 18 : మండలంలోని నాయకపల్లికి చెందిన బిర్రు ఉప్పలయ్య (50) ద్విచక్రవాహనం పైనుంచి పడి బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం. నాయక్‌పల్లికి చెందిన బిర్రు ఉప్పలయ్య టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనంపై సొంత పనుల నిమిత్తం గుండెంగ గ్రామానికి వెళ్లి తిరిగి నాయకపల్లికి వస్తుండగా వాయిల్ బంధం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి, ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో ఉప్పలయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్వాల మహిళలకు ఉమ్మడి జిల్లాస్థాయి అవార్డు

కేసముద్రం, జనవరి 18 : మండలంలోని కల్వాలలో బాలవికాస వాటర్‌ప్లాంట్‌కు రికార్డుల నిర్వహణ, నెలవారీ సమావేశాల్లో ఉత్తమ ప్రతిభకనబర్చినందుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో అవార్డు లభించినట్లు వాటర్‌ప్లాంట్ నిర్వాహక మహిళలు తెలిపారు. ఈ మేరకు కాజీపేట ఫాతిమానగర్‌లో గురువారం నిర్వహించిన బాలవికాస మహాసభలో వ్యవస్థాపకురాలు బాలక్క చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు మాందాటి కళావతి, మూల లావణ్య, సంగ యాదమ్మ, పెదగాని సుజాత, గంట పుష్పలత, చింతల వెంకటమ్మ, కుదురుపాక జ్యోతి, ఆపరేటర్ మాచర్ల రమేష్ పాల్గొన్నారు.

'చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం'

పెద్దవంగర, జనవరి 18 : చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నార్డు సీజీఎం చింతల సుశీల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్ష్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీ కేంద్రాన్ని పరిశీలించి, ఆ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున సంఘాలుగా ఏర్పడి చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారు చేసి, స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించాలన్నారు. నార్డు ద్వారా అందిస్తున్న సేవాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్డు డీడీఎం ఎం.చంద్రశేఖర్, చైతన్యరవి, సీఈవో తల్లూరి లత, చైర్మన్ శంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ఇనుగుర్తి, జనవరి 18 : కేసముద్రం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా 18వ రోజు అయ్యగారిపల్లిలోని వివేకనంద సెంటర్‌లో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ప్రేమ్‌కుమార్, నర్సయ్య ఆధ్వర్యంలోనిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామిడి అశోక్, శ్రీరాములు, కరుణాకర్, విజేందర్, ప్రభాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.


ఆకేరు వాగులో ఇసుకను తోడుతున్న కూలీలు (ఫైల్)


దంతాలపల్లి మీదుగా వరంగల్‌కు ట్రాక్టర్‌లో తరలుతున్న కలప

వాల్టా చట్టానికి తూట్లు

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- విచ్చలవిడిగా బోరుబావుల తవ్వకాలు
- జోరుగా ఇసుక అక్రమ రవాణా

దంతాలపల్లి, జనవరి 18 : ఒక్కప్పుడు గ్రామాలు పచ్చని చెట్లతో కళకళలాడేవి.. పెద్దపెద్ద వృక్షాలు ఆహ్లాదాన్నిచ్చేవి.. అలాంటి చెట్లు, చేమలు ఉన్న ఊళ్లు కానరావడం లేదు. నిత్యం కర్రవ్యాపారం చేసేవారు నేటికి గ్రామాలు, తండాలు తిరుగుతూ చెట్లసైజును బట్టి తగిన ధర ఇస్తోండటంతో సొమ్ముకు ఆశపడి అమ్ముకుంటున్నారు. ఇక నీటి కోసం వేసే బోర్లదీ అదే పరిస్థితి. విచ్చలవిడిగా తవ్వుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నా పట్టించుకునే వారులేరు.

కర్రల లోడుతో దర్శనమిస్తున్న వాహనాలు..

ఉమ్మడి నర్సింహులపేట మండలకేంద్రంతో పాటు దంతాలపల్లి మండలకేంద్రాల్లో నిత్యం కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు, లారీలు దర్శనం ఇస్తున్నాయి. కర్ర వ్యాపారులు వాటి కోసం అడ్డాలను సైతం ఏర్పాటు చేసుకొని చెట్లను నరికిన తర్వాత వాటిని సైజులుగా కట్‌చేసి, వరంగల్ జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి వంట చెరుకుగా కర్ర వ్యాపారం చేసే సామిల్లులకు అమ్ముకుని లాభాలను గడిస్తున్నారు.

బోరుకు బోరుకు మధ్య 200 ఫీట్ల దూరం తప్పనిసరి..

వాల్టా చట్టం ప్రకారం బోరుకు, బోరుకు మధ్య తప్పనిసరిగా 200 ఫీట్ల దూరం ఉండాలి. నేడు ఎక్కడ కూడా అమలు కావడం లేదు. మరి ఇళ్లలో ఫీటుకు ఫీటు మధ్యనే బోర్లు వేస్తున్నారు. అంటే భూమికి జల్లెడ పట్టుతున్నట్టు అనిపిస్తోంది. అక్రమంగా వాల్టా చట్టాన్ని వ్యతిరేకిస్తున్నా అటవి, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. అంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టింపులు తగ్గిపోతున్నాయి. ఆకేరు వాగుల నుంచి, దంతాలపల్లి శివారు శివాలయం నుంచి పోలీస్‌స్టేషన్ గుండా నిత్యం పదులసంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు తొర్రూరుకు తరలుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారిస్తాం..



పి.శ్రీనివాస్‌రావు, తహసీల్దార్

ఆకేరు, పాలేరు వాగుల నుంచి అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. గృహ అవసరాలకైన, ఇతర అవసరాలకు సంబంధిత అధికారులచే అనుమతులు పొంది కలపను తరలించాలి. ఇసుక రవాణాతో పాటు కలపపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

ఘనంగా గోదారంగనాథుల కల్యాణమహోత్సవం


కల్యాణమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి18 : రెడ్యాలలో సర్పంచ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి-బిందు దంపతుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీగోదారంగనాథుల కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క వేడుకలకు డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి హాజరై కల్యాణ వేడుకలను వీక్షించారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించిన ఈ కల్యాణ వేడుకలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. వేడుకలో నర్సింగ్ శ్రీనివాస్, చాంద్, సురేందర్, కార్తీక్, రాజవర్ధన్‌రెడ్డి, మధుసూదన్, నరేష్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

బయ్యారం, జనవరి 18 : మండల కేంద్రంలో గురువారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు చేతుల మీదిగా లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికి 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బయ్యారం తహసీల్దార్ ఇమానీయల్, ఎంపీటీసీ సభ్యులు సనప సోమేష్, తమ్మిశెట్టి కుమారి, తిరుమల శైలజారెడ్డి, బానోత్ మోహన్‌జీ, సర్పంచులు కోటమ్మ, రమేష్, వెంకటేశ్వర్లు, బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్‌నాయక్, మండల అధ్యక్షుడు కంబాల ముసలయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, బానోత్ రాముునాయక్, కేతమల్లు, సత్తిరెడ్డి, శ్రీను, నాగేశ్వర రావు, సుధాకర్‌రెడ్డి, రవి నాయక్, వెంకటపతి, వీరలక్ష్మీ, నిర్మలారెడ్డి పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలకు పూర్వ భవనాన్ని కేటాయించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 18 : జిల్లా కేంద్రంలో ఐటీఐ కళాశాలకు పూర్వభవనాన్ని కేటాయించాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, సూపరింటెంట్ రాజేశ్వర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో గురువారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె భవనం విద్యాబోధనకు అనుకూలంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో ఐటీఐ కళాశాల భవనాన్ని జిల్లా కేంద్రం ఏర్పాటు తొలినాళ్లలో ఎస్పీ కార్యాలయాలనికి కేటాయించారని, దాని పక్కన ఎస్పీ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో అందులో మార్చి విద్యార్థుల సౌకర్యార్థం ఆ భవనాన్ని కేటాయించాలని కోరారు.

'కాంగ్రెస్‌లో కొత్తగా చేరికలు లేవు'

గూడూరు, జనవరి 18 : కాంగ్రెస్‌పార్టీలో కొత్తగా చేరికలు లేవని ఆపార్టీ మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కోసం కష్టపడిన వ్యక్తులతోనే పనిచేయించుకోవాలని, తప్పితే పార్టీలో కొత్తగా ఎవరిని చేర్చుకునేది లేదని స్పష్టం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కొమ్మాలు, శివరాత్రి సంపత్, అర్రెం వీరస్వామి, రాసమల్ల యాకయ్య, చంటి స్వామి, ఎండీ.రసూల్, గంగయ్య మాన్‌సింగ్, శ్రీను, ఎదుల ఆదినారాయణ, రాజేందర్, వీరస్వామి, సాంబయ్య, రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

'గెలుపే లక్ష్యంగా పని చేయాలి'

కురవి, జనవరి 18 : పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. కురవిలో గురువారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రానున్నపార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి తాను ఎంపీగా పోటీచేస్తున్నానని, కార్యకర్తలు సహకరించాలని కోరారు. దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ మతపరమైన రాజకీయాలు చేస్తూ దేశంలో అల్లకల్లోలం సృష్టిస్తుందన్నారు. గతంలో తన భార్య ధన్వంతి ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారని, రానున్న ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని కోరారు. గుగులోతు భీమానాయక్, వాసునాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాంకుడోతు మంగీలాల్‌నాయక్, బానోత్ చందులాల్, బాలాజీనాయక్, వెంకటేష్, సుఖేందర్, మాలోతు శంకర్, వర్ధయ్య, సీహెచ్.గణేష్, రవీందర్ పాల్గొన్నారు.

కొండా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

గూడూరు, జనవరి 18 : గూడూరుకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నుంచి కొంతమంది నాయకులు గురువారం వరంగల్‌లోని కొండా మురళీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గూడూరుకు చెందిన పెసరి శివ, పాటిమీదితండ ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డిలతో పాటు బండారి యుగేందర్, దానబోయిన మధు, రాకేష్, ప్రవీణ్, మురళి, రాజుతో పాటు మరో 30 మందికి మురళీ కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

సౌకర్యాలు కల్పించాలని మంత్రికి వినతి

గూడూరు, జనవరి 18 : గూడూరు మండలం గబ్బిలాలమడుగు సమ్మక్క-సారలమ్మ జాతరలో మౌళిక వసతులు కల్పించాలని జాతర కమిటీ నిర్వాహకులు గురువారం రాష్ట్ర స్త్రీశిశు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్కను ములుగులో కలిసి వినతిపత్రం అందజేశారు. జాతర ఆహ్వాన పత్రాన్ని అందించారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, భక్తుల సౌకర్యార్థం రేకులషెడ్డులను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. జాతర కమిటీ అధ్యక్షుడు అర్రెం వీరస్వామి, పూజారుల కమిటీ అధ్యక్షుడు కొట్టెం కృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్రెం భూపాల్, ఉపాధ్యక్షుడు పర్షక వీరస్వామి, కోశాధికారి పూనెం వీరస్వామి, సారలమ్మ ప్రధాన పూజారి అర్రెం రమేష్, పూజారులు అశోక్, వెంకటేశ్వర్లు, నాగయ్య, గోపాల్, లక్ష్మి, శ్రీను, చంద్రయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

'ఆంధ్రప్రదేశ్‌లో విజయం సాధిస్తాం'

బయ్యారం, జనవరి 18 : తెలంగాణలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అఖండ విజయం సాధించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య జోస్యం చెప్పారు. బయ్యారంలో గురువారం ఆయన మాట్లాడుతూ దివంగత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూతురు షర్మిలను ఏపీపీసీసీ అధ్యక్షురాలిగా నియమించడంతో ఆంధ్రప్రదేశ్‌లో మరోమారు రాజన్న రాజ్యం రానున్నట్లు పేర్కొన్నారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలతో ఆ రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలు కూడా తెలంగాణ మాదిరిగానే మార్పు కోరుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి జనవిజ్ఞాన వేదిక కృషి

డోర్నకల్, జనవరి 18 : పాఠశాలస్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పదాన్ని పెంచడానికి జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) కృషి చేస్తోందని జేవీవీ మండల అధ్యక్షుడు కోయిల రాజేశ్వర్‌రావు అన్నారు. గురువారం డోర్నకల్ జడ్పీ హైస్కూల్లో జన విజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండలంలోని పాఠశాల స్థాయి విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈనెల 27న మండల స్థాయి, ఫిబ్రవరి 3న జిల్లాస్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి, ఎస్.శ్రీనివాస్, రమేష్ బిచ్చు, వసంతరాణి, మంజులత, కమల, భవాణి, ఎస్‌కె అమీనా, సురేష్ రమేష్, కృపాకాంత, శేషకుమారి, శ్రీనివాస్, రామకృష్ణ, అప్పిరెడ్డి, మాధవ రావు, సంగయ్య, షాహీంలు పాల్గొన్నారు.

అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

డోర్నకల్, జనవరి 18 : 2024-25 విద్యాసంవత్సరానికి గాను మైనార్టీ పాఠశాలలు, కళాశాలలో అడ్మిషన్‌లు పొందేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డోర్నకల్ మైనార్టీ పాఠశాల ప్రిన్సిపల్ మహ్మద్ రిజ్వాన ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు మైనార్టీ విద్యాసంస్థలు, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఇటీవల దిగిన కలర్ పాస్‌ఫోటో, కుల, నివాసం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ దృవీకరణ పత్రాన్ని జత చేయాలని చెప్పారు. ఈ సదావకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వాములకు ఘన స్వాగతం

కురవి, జనవరి 18 : కురవి నుంచి శబరిమలకు మహాపాదయాత్ర 1200 కిలోమీటర్లు పూర్తి చేసి తిరిగి స్వగ్రామమైన కురవికి వచ్చిన స్వాములకు గురువారం కురవిలో ఘన స్వాగతం పలికారు. కురవికి చెందిన గురుస్వామి సంగెం నాగరాజు, వేమిశెట్టి సంతోష్, కన్నె గురుమూర్తి, బూర్గుల రాకేష్, కిన్నెర మహేష్ అయ్యప్పస్వామి మాల ధరించిన రోజు నుంచే పాదయాత్ర మొదలుపెట్టి 36 రోజుల్లో శబరిమలకు చేరుకున్నారు. అనంతరం మకర జ్యోతిని దర్శించుకుని తిరిగి కురవి వచ్చిన స్వాములకు గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బాదె నాగయ్య, అవిరె మోహన్‌రావు, సంగెం నాగరాజు, కొంతం సత్యం పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలను పెంచాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీనావాస్

గార్ల, జనవరి 18 : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారి పనులు చేసే భవన నిర్మాణ కార్మికులకు వేతనాలను పెంచాలని సీఐటీయూ గార్ల మండల కార్యదర్శి కందునూరి శ్రీనావాస్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వేతనాలను పెంచాలని కోరుతూ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రోజురోజు పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా కూలీల రేట్లును సవరించాలన్నారు. ఈకార్యక్రమంలో మేస్త్రీలు జడ శ్రీను, మౌలానా, ఎల్లయ్య, వెంకన్న లాలు, నాగరాజు, చిట్టి, బుజ్జి, ఉపేందర్ పాల్గొన్నారు.

'టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి'

మరిపెడ, జనవరి 18 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. గురువారం మరిపెడలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అయన ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘ ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి తప్పక పరిష్కరిస్తారని గుర్తు చేశారు. ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి నందిగామ జనార్ధనాచారి, మండల బాధ్యులు ప్రభాకర్, గోవర్ధన్, శ్యామ్, మంగు, మంగీలాల్, ఎఫ్‌డబ్ల్యూ కన్వీనర్ రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

● కురవి : కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో నిరుపేదలందరికి తప్పక న్యాయం జరుగుతుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. కురవి శివారులో సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలు గురువారం ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికి ఇండ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, నెల్లూరి నాగేశ్వర్‌రావు, కర్నం రాజన్న, కన్నె వెంకన్న, తురక రమేష్, కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు

మరిపెడ, జనవరి 18 : మరిపెడ మునిసిపల్‌లోని షిర్డీ సాయిబాబా మందిరం భక్తులతో కిటకిటలాడింది. గురువారం సాయిబాబాకు అత్యంత ప్రీతివారం కావడంతో పట్టణ, పల్లె ప్రజలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని, సాయిబాబాను దర్శించి మొక్కులు చెల్లించారు. అర్చకుడు రవీంద్రాచారి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అలయ నిర్వాహకులు మహా అన్నదానం నిర్వహించారు. వెంపటి లక్ష్మీనారాయణ, పువ్వాడ నర్సయ్య, తారకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ


జీఎంపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, యాదవ సంఘ నాయకులు

పెద్దవంగర, జనవరి 18 : గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ వీరగంటి మహేందర్, యాదవ సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, మండల కార్యదర్శి బుచ్చన్న మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలని, గత ప్రభుత్వం రెండోవిడత పూర్తిస్థాయిలో చేపట్టలేదని, డీడీలు చెల్లించిన యాదవులకు గొర్రెలను అందించాలన్నారు. జిల్లా నాయకులు రాసల సమ్మయ్య, మల్లయ్య, శ్రీనివాస్, రాంమూర్తి, వీరన్న, యాకరాజు, శ్యామ్, కుమార్, వీరన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నగూడూరు, జనవరి 18 : బాధిత కుటుంబాన్ని గురువారం మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మన్నెగూడెం గ్రామానికి చెందిన మెట్టు బచ్చులు (72) కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుదగాని నాగేషలు మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు.